పాఠశాలలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఎన్ఆర్ ఆస్పత్రి సౌజన్యంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ ప్రాజెక్ట్‌లో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. అవసరమైన మందులను అందజేశారు. అనంతరం హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్ రెడ్డి, వైద్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిసాన్- 2025కు తరలి వచ్చిన రైతులు



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న వ్యవసాయ ప్రదర్శన కిసాన్ -2025ను తిలకించేందుకు శనివారం వివిధ జిల్లాల నుంచి రైతులు తరలి వచ్చారు. వివిధ రకాల వంగడాల గురించి స్టాల్స్ నిర్వాహకులు రైతులకు వివరించారు. యంత్ర పరికరాలు, పనిముట్లను చూపుతూ అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శన నేటితో ముగియనుంది.

వైభవంగా రంగనాథుని కల్యాణోత్సవం



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రంగనాథస్వామి, లక్ష్మీదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో రంగనాథస్వామివారికి పూజలు, అర్చనలు, అభిషేకం నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్ అదృశ్యం

గచ్చిబౌలి: భార్యతో గొడవపడి బయటకు వెళ్లిన వాచ్‌మెన్ అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలం, తాళ్లపాలెంకు చెందిన డీ. సుబ్రహ్మణ్యం(31) భార్య వెంకటదుర్గతో కలిసి సంవత్సరం క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చారు. గచ్చిబౌలి జనార్దన్‌హిల్స్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీ రాత్రి భార్యతో గొడవపడి వెళ్లిపోయాడు. సమీప ప్రాంతాలలో వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య వెంకటదుర్గ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాపోటీలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫిప్ అండ్ ఫిదర్ అకాడమీ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ మాట్లాడుతూ గత నెల రోజులుగా వివిధరకాల పోటీలను నిర్వహిస్తున్నామని 470 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

చందానగర్: మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్‌లో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున సీసీ రోడ్డు పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.93.50 లక్షలతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్, నాయకులు బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చందానగర్: ఇంటర్ విద్యార్థికి హోప్ ఫౌండేషన్ ఆర్థికసాయం అందించింది. శనివారం చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో చైర్మన్ కొండ విజయ్‌కుమార్ శాంతినగర్‌కు చెందిన విద్యార్థిని భార్గవికి రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో రాణిస్తున్న భార్గవి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో హోప్ ఫౌండేషన్ ఆదుకుందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సదాశివుని విజయ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారం..

ట్రాఫిక్ సమస్య

పట్టించుకోని ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు

మియాపూర్: ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్, రోడ్ల పక్కన పార్కింగ్ కారణంగా పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండడంతో వినియోగదారులు ఆగి వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో ప్రధాన రహదారుల్లో భారీగా ట్రాఫిక్ నెలకొంటోంది. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- మియాపూర్- బొల్లారం క్రాస్ రోడ్డు నుండి మెట్రోస్టేషన్ వరకు జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన కిలోమీటర్ల మేర ఫర్నిచర్ దుకాణాలు నిర్వహిస్తున్నారు.
- ఈ వ్యాపార సముదాయాలకు, ఫర్నీచర్ కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులు వారి వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం నిత్యం కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతుంది.
- మియాపూర్ న్యూ కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్ 28లోని ప్రభుత్వ భూమి ఉంది. దశాబ్దాల కాలంగా ఇక్కడ ప్రతి మంగళవారం సంత నిర్వహిస్తుంటారు. చుట్టుపక్కల కాలనీలు, బస్తీల నుండి పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. అక్కడే సమీపంలో బస్టాప్‌లున్నాయి. అదేవిధంగా ఈ ప్రాంతంలో ప్రైవేటు బస్సులు పార్క్ చేస్తారు. దీంతో పాటు రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై ఫర్నీచర్ అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దీంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- మియాపూర్, మదీనాగూడ జాతీయ రహదారి పక్కన సాయంత్రం 5 గంటల నుండి అర్ధరాత్రి వరకు రోడ్లపైన టిఫిన్ బండ్లు అమ్మకాలు చేస్తుంటారు. అదే సమయంలో ఉద్యోగులు,విద్యార్థులు, ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చే వారు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ట్రాఫిక్ జామ్ నెలకొని గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.



మియాపూర్ జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌లపై ఫర్నీచర్ షాపులు





జాతీయ రహదారిపై ట్రాఫిక్

ఫెన్సింగ్ తొలగించినా చర్యలేవీ..?

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌ను అడ్డుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు, లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించినా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

తొలగించినా ..మళ్లీ ఏర్పాటు

రెండు సంవత్సరాల క్రితం ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని ఫర్నీచర్, దుకాణాలను రెవెన్యూ, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. రహదారి వెంబడి ఫుట్‌పాత్‌ల పక్కన ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. క్రమేణా వ్యాపారులు ఆ ఫెన్సింగ్‌ను తొలగించి తిరిగి వ్యాపారం చేస్తున్నారు.

స్వరార్చన.. నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం లహరి డ్యాన్స్ అకాడమీ గురువు డాక్టర్ ఝాన్సీరామ్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. వినాయకకౌతం, అలరులు కురియగా, దశావతారం, శివకౌత్వం, జతిస్వరం తదితర అంశాలను శాన్వి, దీక్షిత, సాహితి, హర్షిత, లక్షిత, తనుశ్రీ, నవ్య, నందిని, అద్విక తదితరులు ప్రదర్శించారు.

హెచ్‌సీయూలో స్వచ్ఛభారత్



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ పార్కు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శనివారం ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం నిర్వహించింది. ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెత్తాచెదారం, వ్యర్థాలు, విరిగిన చెట్ల కొమ్మలు, గడ్డి తొలగించారు. ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల సహకారంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా 'రెసో దర్పణ్'

మాదాపూర్: రెసోనెన్స్ గురుకుల కళాశాల వార్షికోత్సవాన్ని రెసో దర్పణ్ పేరుతో శనివారం ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సంగారెడ్డి డీఈఓ ఎస్ వెంకటేశ్వర్లు, పటాన్‌చెరు ఎంఈఓ నాగేశ్వర్‌నాయక్, ప్రఖ్యాత రచయిత తనికెళ్ళ భరణి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వామిగౌడ్‌లు హాజరయ్యారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులకు సరళమైన పద్ధతిలో విద్యను బోధిస్తున్నామన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అలరించారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మణికొండ: గురుకుల పాఠశాల విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారంనార్సింగిలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

- విద్యార్థినుల కోసం వండిన ఆహారం, పాఠశాల, డైనింగ్ హాల్, వంటశాల, స్టోర్ రూమ్‌లలో నిలువ ఉంచిన సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థినులకు రుచికరంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బంది, అధికారులను ఆదేశించారు. ఆహారాన్ని వండే సిబ్బంది శుభ్రంగా ఉండాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.
- విద్యార్థినులను మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. పాఠశాలలో ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులలో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే వాటిని నివృత్తి చేయాలన్నారు.
- పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేసి పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదవ తరగతిలో వంద శాతం అత్యుత్తమ గ్రేడ్లతో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందంటూ..
- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన

చందానగర్: వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తన చెల్లెలు మృతి చెందిందంటూ మృతురాలి అన్న కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ మియాపూర్ మదీనాగూడ సిదార్థ ఆస్పత్రి ఎదుట మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా నందలూరు గ్రామానికి చెందిన కార్తీక్ రెడ్డి చెల్లెలు సుహాసిని (26) జనవరి 11న ఇంట్లో కళ్ళు తిరిగి కిందపడిపోయింది. దీంతో కడపలో ఓ హాస్పటల్‌కు తీసుకువెళ్లగా చిన్న మెదడులో రక్తస్రావం జరిగిందని చెన్నై లేక హైదరాబాద్‌కు తీసుకువెళ్ళాలని వైద్యులు సూచించారు. దీంతో నగరంలో ఉంటున్న యువతి అన్న కార్తీక్‌రెడ్డి మియాపూర్ మదీనాగూడలోని సిదార్థ హాస్పటల్‌కు తీసుకువచ్చారు. జనవరి 12న ఉదయం హాస్పటల్‌లో చేర్పగా 27 రోజుల పాటు వైద్యం అందించారని సుమారు రూ.13 లక్షలు బిల్లులు చెల్లించామన్నారు. శుక్రవారం సాయంత్రం యువతి ఆరోగ్యం క్షీణించిందని మరో హాస్పటల్‌కు తీసుకువెళ్ళాలని సూచించడంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని నిమ్స్ వైద్యులు తెలిపారు. ఈ మేరకు కార్తీక్‌రెడ్డి తిరిగి సిదార్థ ఆసుపత్రికి వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ సంబురాలు



మియాపూర్: ఢిల్లీలో బీజేపీ గెలుపొందిన సందర్భంగా మియాపూర్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ హాజరై నాయకులు, కార్యకర్తలతో కలిసి టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇక తెలంగాణలో కాషాయ జెండాను ఎగురవేయడమే లక్ష్యమని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మనోజ్‌కుమార్ కుటుంబానికి ఎల్ఓసీ పత్రాలను అందించిన ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీకి చెందిన మనోజ్‌కుమార్‌కు రూ.3 లక్షలు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను బాధిత కుటుంబాలకు ఆయన అందించారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, ఖాసీమ్, లియాకత్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 4లక్షల 50వేల రూపాయలను శనివారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన మనోజ్‌కుమార్‌కు 3 లక్షలు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయిచరణ్ కాలనీకి చెందిన భీమరాజుకు 1లక్ష 50 వేల రూపాయలు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, ఖాసీం, లియాఖత్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, బ్రిక్ శ్రీనివాస్, పోతుల రాజేందర్, మారెళ్ల శ్రీనివాసరావు, పురేందర్‌రెడ్డి, కావూరి అనిల్, ఎల్లం నాయుడు, శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న క్రాఫ్ట్ మేళా

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళాకు శనివారం సెలవురోజు కావడంతో నగరవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంబల్పూరి ఫోక్ డ్యాన్స్, పైకా డ్యాన్స్, మయూరభంజ్ ట్రైబల్ మార్షల్ ఆర్ట్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ సూర్య నారాయణ పాణిగ్రహి, ఐఆర్‌డీఏ మేనేజర్ సత్యజిత్ త్రిపాఠి, డీఆర్‌డీఓ సైంటిస్ట్ సునీతాజైన్, మైండ్‌స్పేస్ వైస్ ప్రెసిడెంట్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.





11న 'మనూ'లో ప్రత్యేక చిత్రాల ప్రదర్శన

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్‌లో ఈనెల 11వ తేదీ ప్రత్యేక చిత్రాల ప్రదర్శన జరగనుంది. ఐఎంసీ ప్రాంగణంలోని ప్రివ్యూ థియేటర్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో చీఫ్ ప్యాట్రన్‌గా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ప్యాట్రన్‌గా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, నిర్వాహకులుగా ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, ఐఎంసీ నిర్మాత మహ్మద్ ముజాహిద్ అలీ పాల్గొంటారు. అనంతరం ప్రఖ్యాత సీనియర్ వన్యప్రాణుల చిత్ర నిర్మాత, సినిమాటోగ్రాఫర్ సుబ్బయ్య నల్లముత్తు కార్యక్రమం ఏర్పాటు చేశారు. 'టైగర్ అంథెమ్' పేరుతో చిత్ర ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కార్ల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్‌ల తొలగింపు



కార్ల అద్దాల బ్లాక్ ఫిల్మ్‌లను తొలగిస్తున్న రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో శనివారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కారు అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. 50 వరకు కార్లకున్న నల్ల తెరలను తొలగించి వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... నెల రోజుల వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, ఎవరైనా తమ కార్లకు ఫిల్మ్‌లు ఏర్పాటు చేసుకుంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఎవరూ కారు అద్దాలకు నల్ల తెరలు ఏర్పాటు చేసుకోవడానికి వీల్లేదన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాలు విధించనున్నట్లు ఆయన హెచ్చరించారు.

12న రథోత్సవం

రాయదుర్గం: రాయదుర్గంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో వేంకటేశ్వర స్వామికి అర్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కాగా 12వ తేదీ రథోత్సవం జరగనుంది.

ప్రమాదకరంగా..





వివేకానందనగర్ కాలనీ పార్కు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్‌బాక్స్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాల వద్ద తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గాలులకు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల ముందు వేలాడుతుండడంతో బాటు మరికొన్ని వైర్లు అతుకులతో కూడి ప్రమాదకరంగా మారాయి. ఒక్కో వైరుకు సుమారు 10 చోట్ల అతుకులు ఉన్నాయని, చిన్నపాటి గాలులకే తెగిపడే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో కొన్ని వీధుల్లో చెట్లు పడిపోయి, వైర్లు తెగి స్తంభాలు కూలిన ఘటనలు కూడా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ వైర్లు గాలులకు ఊగకుండా ప్లాస్టిక్ వస్తువులను ఏర్పాటు చేసి మమ అనిపించుకుంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తుందని చెప్పారు. పార్కుల ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారులు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వైర్లు సరిచేయాలని, ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.







అతుకులతో వేలాడుతున్న విద్యుత్ వైర్లు